క్లుప్తంగా

ఆరుగురికి ట్యూబెక్టమీ ఆపరేషన్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఆరుగురికి ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన ఆరుగురు మహిళలకు ఆరోగ్య,ఆశా, అంగన్ వాడి సిబ్బంది సహకారంతో ఆసుపత్రిలో చేర్పించారు. సర్జన్లు డాక్టర్ శ్రీనివాసరావు, విజయభార్గవ్, అనస్థీషియన్ డాక్టర్.పి.జాన్సీరాణి వారికి శస్త్రచికిత్స నిర్వహించారు.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు

పాములపాడు: జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆయా గ్రామాల సచివాలయాల్లో కొనసాగుతోంది. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు లబ్ధిదారులకు అవగాహన కలిస్తూ రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో 2,051 మంది లబ్ధిదారులకు గాను ఇప్పటి వరకు 1264 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు ఎంపీడీఓ సరస్వతి బుధవారం తెలిపారు. త్వరిత గతిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సచివాలయాల తనిఖీ

పాములపాడు: మండలంలోని జూటూరు-1, జూటూరు(తుమ్మలూరు)-2 , చెలిమిల్ల గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ సరస్వతి బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. పీఎంజేవై హెల్త్ కార్డులు, ఈకేవైసీ, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు, కులగణన పై ఆరా తీశారు. చెలిమిల్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి

పాములపాడు: మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుచ్చిరెడ్డి(78) కొన్ని రోజులుగు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ పాములపాడు చేరుకొని మృతదేహానికి పూల మాల వేసి నివాళ్లులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మిడుతూరు తహసీల్దార్‌గా తులశమ్మ


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ తులశమ్మ

మిడుతూరు: మండల నూతన తహసీల్దార్‌గా తులశమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రకాష్ బాబు వైఎస్సార్ జిల్లా చెన్నూరు మండలానికి బదిలీపై వెళ్లారు. కాగా, వైఎస్సార్ జిల్లా రాజంపేట నుంచి నంద్యాల ఎస్ఆర్‌బీసీలో లోకలైజేషన్ స్పెషల్ తహసీల్దార్‌గా తులశమ్మ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. అయితే మిడుతూరుకు బదిలీపై వచ్చిన తహసీల్దార్ జాయిన్ కాకపోవడంతో ఆ స్థానంలో నంద్యాలలో విధులు నిర్వహిస్తున్న తులశమ్మను నియమించారు. ఈ మేరకు ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

నాగలూటిలో ఏర్పాట్ల పరిశీలన


నాగలూటి కోనేరును పరిశీలిస్తున్న ఈఈ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తత ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా బుధవారం దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.మురళీధర్‌రెడ్డి నాగలూటి, పెద్దచెరువు ప్రాంతాలను పరిశీలించారు. కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం నాగలూటి, పెద్దచెరువు, దామర్లకుంట వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు పైప్ పెండాల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేవస్థాన డీఈఈ పి.వి.సుబ్బారెడ్డి, ఏఈ రంగప్రసాద్, అటవీశాఖ రేంజ్ అధికారి దొరస్వామి పాల్గొన్నారు.

ఘనంగా సంజీవయ్య జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: మచ్చలేని రాజకీయ నాయకుడు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్. శ్రీనివాసరావు అన్నారు. దామోదరం సంజీవయ్య జయంతిని శ్రీశైలం ప్రాజెక్ట్ రింగ్‌పార్క్ వద్ద నిర్వహించారు. మైలా.తులసీరాం, డాక్టర్ విజయభార్గవ్, డాక్టర్.పి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు శివప్రసాద్ అధ్యక్షతన సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు పుల్లన్న, విల్సన్, డాక్టర్ వెంకటేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో ప్రమాదం

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాబోలుకు చెందిన తోకల రాజ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గిద్దలూరు నుంచి బైక్‌పై వస్తుండగా సర్వనరసింహ స్వామి ఆలయం మలుపు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు.


కొలనుభారతి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న శ్రీశైలం దేవస్థానం అధికారులు, అర్చకులు


కొలనుభారతిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న భక్తులు

విద్యాప్రదాయినీ నమోస్తుతే

- కొలనుభారతిలో వైభవంగా వసంతపంచమి వేడుకలు
- సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు
- ఆలయ ఆవరణలో చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి

కొత్తపల్లి: మండలంలోని శివపురం సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతిదేవి ఆలయంలో సరస్వతీ అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా వసంతపంచమి వేడుకలు బుధవారం ఈఓ మోహన్, చైర్మన్ వెంకటనాయుడు ఆధ్వర్యంలో వైభవంగ జరిగాయి. సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రాతఃకాలంనే అమ్మవారికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, సహస్ర నామ కుంకుమార్చన, పుష్పార్చన, మహమంగళహారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం సూపరింటెండెంట్ జి.స్వాములు, అర్చకులు సత్యనారాయణ స్వామి, వీరయ్య, రాములు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, పలు రకాల పుష్పాలు, ఫలాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో కొలనుభారతి క్షేత్రం కిటకిటలాడింది. అమ్మవారిని 1,379 మంది దర్శించుకొగా 42 మంది కుటుంబ సమేతంగా కుంకుమార్చన పూజాకార్యక్రమాలు జరుపుకున్నారు.

అక్షరాభ్యాసాల వేడుక

అమ్మవారి సన్నిధిలో వసంత పంచమిని పురస్కరించుకొని అక్షరాభ్యాసాలు వేడుకగా జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారి సన్నిధిలో వారి చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు జరుపుకున్నారు. సాముహిక అక్షరాభ్యాసాలతో అమ్మరిక్షేత్రం పులకించిపోయింది. ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తే చిన్నారుల భవిష్యత్తు ఉత్తమంగా ఉంటుందని, అమ్మవారి అనుగ్రహంతో విద్యాబుద్ధులు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోశ్చరణల నడుమ తల్లిదండ్రులు చిన్నారులకు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేసుకున్నారు. సుమారు 613 మంది చిన్నారులకు అమ్మవారి దివ్య సన్నిధిలో అక్షరాభ్యాసాలు జరిగాయి.


జూపాడుబంగ్లాలో దేదీప్యమానంగా దర్శనమిస్తున్న సరస్వతీ అమ్మవారు

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

వసంతపంచమిని పురస్కరించుకొని సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన కొలనుభారతిదేవి అమ్మవారిని ప్రముఖులు దర్శించుకున్నారు. కాకనూరు శ్రీ శారదపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి అమ్మవారిని దర్శించుకొని విశేష పూజాకార్యక్రమాలు జరిపారు. అదేవిధంగా జూటూరు స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ దారా సుదీర్, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, కో-ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్‌గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి అమ్మవారిని దర్శించుకొని విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. అనంతరం వారిని ఆలయ ఈఓ మోహన్ పురోహితులతో కలసి దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగ భూషన్, కొత్తపల్లి తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ జవహర్‌బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో భక్తులకు దేవాదాయ శాఖవారు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ శివన్న, సచివాలయాల మండల కన్వీనర్ నాగలక్ష్మీరెడ్డి, పాలకమండలి సభ్యుడు రామలింగారెడ్డి, నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


కాకనూరు శారదాపీఠంలో హోమం చేస్తున్న పీఠాధిపతి శివయోగీంద్ర సరస్వతీ స్వామి

భక్తిశ్రద్ధలతో వసంతపంచమి వేడుకలు

జూపాడుబంగ్లా : వసంతపంచమిని పురస్కరించుకొని బుధవారం సరస్వతీ అమ్మవారి పుట్టినరోజు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని జూపాడుబంగ్లా గ్రామంలోని క్వార్టర్సు కాలనీలో వెలసిన శ్రీ వీణాపాణి సరస్వతీదేవి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలను ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిగ్రహానికి పన్నీటిస్నానం చేయించి పంచామృతాభిషేకం, వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు. అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 7గంటల ప్రాంతంలో అంగరంగ వైభవంగా ముస్తాబుచేసిన రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుంచి గ్రామపురవీధుల్లో ఊరేగించారు.

మహానందిలో శ్రీ పంచమి వేడుకలు

మహానంది:మహానంది ఆలయంలో శ్రీ పంచమి సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. క్షేత్రంలోని కామేశ్వరి అమ్మవారి ఆలయం ఎదుట ఉన్న మండపంలోని ఏకశిలా సరస్వతీదేవి విగ్రహానికి ఆలయ వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. పలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఆలయం చేరుకుని వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించుకున్నారు.

శారదాపీఠంలో సరస్వతీ హోమం

బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలోని శ్రీ శారదా పీఠంలో పీఠాధిపతి శ్రీ శివయోగీంద్ర సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, సరస్వతీ పూజ, అమ్మవారికి పంచామృతాభిషేకం, సరస్వతీ హోమం వైభవంగా చేపట్టారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ రఘురామాచార్యులు ఆధ్వర్యంలో సరస్వతీ పూజ చేపట్టారు.

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆత్మకూరు: రాష్ట్రంలో పేద ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారిఫ్ అన్నారు. పట్టణంలోని హెల్త్ సెంటర్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు, మందులు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రసీద్, వైద్యులు రాయుడు పాల్గొన్నారు.

పేదల కోసమే..

నందికొట్కూరు: పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం తెచ్చారని డాక్టర్లు రాజశేఖర్, శ్వేత అన్నారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 6వ సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 510 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా


మాట్లాడుతున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

పగిడ్యాల: మూడు నెలల కోసారి నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కాకుండా కిందిస్థాయి సిబ్బంది రావడంపై ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కవిరాజు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేతిపంపులు, బోర్లకు మరమ్మతులు చేయించాలని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అయితే సమాధాన మిచ్చేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అందుబాటులో లేకపోడవంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరైన వెటర్నరీ డాక్టర్, హౌసింగ్ ఏఈ, కేసీ కెనాల్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎక్సైజ్ శాఖ అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు కలెక్టర్‌కు నివేదిక పంపాలని ఎంపీడీఓకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏఓ విజయ్‌జ్యోతుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి రికార్డు స్థాయిలో సీఎంఆర్ఎఫ్ మంజూరు


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ జిల్లాలో రికార్డు స్థాయిలో శ్రీశైలం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కింద ప్రమాదాల్లో గాయపడిన, మృతి చెందిన వారికి వివిధ రకాలుగా దాదాపు రూ.10కోట్లకు పైగానే బాధితులకు అందజేశారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, బుధవారం అబ్దులాపురం గ్రామానికి చెందిన తేజేశ్వర్‌రెడ్డికు రూ.22వేలు, సౌజన్య రూ.20వేలు, వెలుగోడుకు చెందిన అనురాధకు రూ.30వేలు, ఈర్నపాడుకు చెందిన అన్నపు ఎలిజబెత్‌రాణి రూ.1,50,000, గాజుల పల్లికి చెందిన మద్దిలేటిస్వామికి రూ.60వేలు, ఆత్మకూరు పట్టణానికి చెందిన గరుడాద్రి నాగమణికి రూ.85వేలు చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, పుల్లయ్య, అంబాల ప్రభాకరరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డాక్టర్ దారా సుధీర్

కొత్తపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద వెలుగు ఏపీఎం పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సుధీర్ మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పొదుపు మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణాలు మాఫీ చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.

532 గ్రూపులకు రూ.3,32,17,983

మండలంలో నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా 532 స్వయం సహాయక సంఘాలకు గాను రూ.3,32,17,983 ప్రభుత్వం పొదుపు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేసిందని దారా సుధీర్ తెలిపారు. ప్రతి మహిళ స్వయంగా ఎదగాలన్నదే జగనన్న ఆశయం అన్నారు. ఎన్నికల హామీలను 100 శాతం నేరవేర్చిన ముఖ్యమంత్రి దేశంలో ఏకైక వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలు అవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు అమలు చేస్తుండడంతో ఏపీ దేశంలోనే ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. ఇలాంటి సంక్షేమం మరలా అక్కాచెల్లెమ్మలందరూ అందుకోవాలంటే మళ్లీ జగనన్నను ఆదరించాలన్నారు. అనంతరం పొదుపు మహిళలకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేశారు. పొదుపు మహిళలతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్ బాబు, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ నాగలక్ష్మి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, సర్పంచ్ బాల ఎల్లయ్య, ఎంపీటీసీ స్రవంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఇంట్లో చోరీ

నందికొట్కూరు: పట్టణంలోని సంగయ్యపేటలోని 28వ వార్డు కౌన్సిలరు రాధిక ఇంట్లో 11వ తేదీ రాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. 12న ఉదయం నిద్రలో నుంచి లేచి చూసుకోగా బీరువా తెరిచి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. నాలుగు తులాల బంగారం, రూ, 6 వేల నగదు చోరీ జరిగినట్లు బాధితుడు రాజశేఖరప్ప ఫిర్యాదు చేశాడు.

21న మొదటి సమన్వయ కమిటీ సమావేశం

మహానంది: మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మొదటి కోఆర్డినేషన్ సమావేశం ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. నంద్యాల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

బట్టల దుకాణంలో అగ్నిప్రమాదం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని సిద్దిరామప్ప షాపింగ్ కాంప్లెక్స్‌లోని మారంపూడి శ్రీనివాసులుకు చెందిన బట్టల దుకాణంలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన దుకాణదారులు దేవస్థానం అధికారులకు సమాచారం అందించడంలో వాటర్ ట్యాంకులు తెప్పించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

జగనన్న పాలన అభివృద్ధికి చిరునామా

- ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- బిజినవేములలో రూ.3.15కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి
- ఆర్బీకే, సచివాలయం ప్రారంభం


కుళాయిని ప్రారంభిస్తున సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్

నందికొట్కూరు రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పరిపాలన అభివృద్ధికి చిరునామాగా నిలిచిందని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థ రెడ్డి అన్నారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని బిజినవేముల గ్రామంలో రూ.3.15కోట్లతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌తో పాలు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజినవేముల గ్రామ సర్పంచ్ రవి యాదవ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులం, మతం, పార్టీ జెండా చూడకుండానే అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో రూ.2.50వేల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. మీకు మేలు జరిగితేనే రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

పార్టీలన్నీ ఏకమైనా గెలుపు వైఎస్సార్‌సీపీదే..

నియోజకవర్గంలో అన్ని పార్టీలు ఏకమైనా గెలిచేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అని సిద్దార్థరెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి సీఎం జగనన్న అయితే ఇచ్చిన మాటను తప్పే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ఎటువంటి వ్యక్తి కావాల్లో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గ సమన్వయ కర్త దారా సుధీర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, ఎంపీపీ మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పబ్బతి రవి, సింగిల్ విండో చైర్మన్ సతీష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మన్సూర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ జబ్బార్, అయ్యన్న, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఆత్మకూరు: పట్టణంలో ఈ ఏడాది వేసవిలో మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారుఫ్, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రషీద్, వైస్ చైర్మన్ రాజగోపాల్, కమిషనర్ హ రిప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పట్టణంలోని 24వ వార్డులో నూతన బోర్ల ఏర్పాటు, పాత బోర్లకు మరమ్మతు, మోటార్ల రిపేరి చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వెలుగోడు: పట్టణంలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని రోఖియాబీ దర్గా నుంచి మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ వేల్పుల జయపాల్ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, తడికల బాషా, వెల్డింగ్ వలి పాల్గొన్నారు.

15వ వార్డులో బోరు ఏర్పాటు

నందికొట్కూరు: వేసవి కాలంలో దాహం తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో బోరు వేస్తునట్లు 15వ వార్డు కౌన్సిలరు కృష్ణవేణి తెలిపారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డులో బోరు వేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్జి, రమేష్, ముర్తుజా వలి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేలాలకు స్పందన కరువు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారంలో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలాలకు స్పందన కరువైంది. ఆలయ ప్రాంగణంలో టెంకాలయ విక్రయం, పాదరక్షలు భద్రపరిచేందుకు, ఐస్‌క్రీమ్స్ విక్రయించుకునేందుకు బహిరంగ వేలాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ విశ్వనాధరెడ్డి, ఈఓ నాగప్రసాద్, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేలాల్లో కూల్‌డ్రింక్స్ విక్రయించుకునే హక్కును పుష్పరాజు రూ.2.30 లక్షలకు దక్కించుకున్నారు. మిగిలిన అంశాలకు త్వరలోనే బహిరంగ వేలాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

మహాకుంభాభిషేకానికి ప్రముఖులకు ఆహ్వానం


డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఏఈవో మోహన్


శారదా పీఠం పీఠాధిపతి స్వరూపా నందేంద్ర సరస్వతికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిషనర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న మహాకుంభాభిషేక మహోత్సవానికి దేవస్థానం తరపున పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. బుధవారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.జవహర్‌రెడ్డిని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శ్రీశైలం ఈఓ డి.పెద్దిరాజు, ఏఈఓ ఐ.ఎన్.వి.మోహన్, అర్చకస్వాములు, వేదపండితులు కలిసి ఆహ్వానించారు. పత్రికను, వేద ఆశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ, విశాఖ శారదా పీఠం పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతి మహాస్వామి, పీఠం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివారిని, దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికాల్ వళవన్‌లను ఆహ్వానించారు.

రైతుభరోసా కేంద్రం ఆకస్మిక తనిఖీ

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు బుధవారం ఏఓ కె.మహేష్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ పంటనమోదు, ఈకేవైసీ ఈనెల 15 లోపు రైతులతో పూర్తి చేయించాలని సూచించారు.